క్లుప్తంగా

అంబేడ్కర్ విగ్రహ ప్రతిష్ఠాపనకు భూమిపూజ

స్టేషన్‌ఘన్‌పూర్ : మండలంలోని సముద్రాల గ్రామంలో జైభీమ్ యూత్ ఆధ్వర్యంలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహ ప్రతిష్ఠాపనకు ఆదివారం భూమిపూజ కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమాన్ని బౌద్ధ బిక్షులతో బౌద్ధ సంప్రదాయం ప్రకారం ఘనంగా చేపట్టారు. గ్రామంలో విగ్రహ ఏర్పాటుకు రాజకీయ పార్టీలకతీతంగా అందరూ సహకరించాలని యూత్ బాధ్యులు కోరారు. నాగరాజు, ప్రవీణ్, నర్సయ్య, మహేందర్, భిక్షపతి, నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఉద్యమించాలి

పాలకుర్తి : మహిళలు తమ హక్కుల సాధన కోసం పోరాడి తమ భారాన్ని తగ్గించుకున్నారని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని మహిళలు హక్కుల సాధన కోసం పోరాడాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి చిట్యాల సోమన్న అన్నారు. ఆదివారం పాలకుర్తిలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ చిట్యాల ఐలమ్మ, మల్లు స్వరాజ్యంల పోరాట స్ఫూర్తిని కొనసాగించాలని అన్నారు. మహిళలు లక్ష్మి, ఉపేంద్ర, ఎల్లమ్మ, సుశీల, ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.

మిత్రుడికి చేయూత



చిల్పూరు : మండలంలోని చిన్నపెండ్యాలకు చెందిన జింక రాజు అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరాడు. డయాలసిస్ చేయించుకునే ఆర్థిక స్తోమత లేక ఇబ్బందిపడడాన్ని తోటి 10వ తరగతి స్నేహితులకు విషయం తెలిసింది. దీంతో గడ్డమీది సురేష్, తాళ్లపల్లి క్రాంతిలు వాట్సాప్ ద్వారా సహమిత్రులకు సమాచారం ఇచ్చారు. ప్రతి ఒక్కరూ స్పందించడంతో ఆదివారం వరకు వచ్చిన రూ. 32,600 వేలు కుటుంబ సభ్యులకు ఆర్థికసాయంగా అందజేశారు.

ఉత్సవ కమిటీ నియామకం

రఘునాథపల్లి : మండలంలోని ఖిలాషాపూర్‌లో మే 6, 7, 8 తేదీల్లో నిర్వహించనున్న దుర్గామాత, ఎల్లమ్మ దేవతల ఉత్సవాల విజయవంతానికి ఆదివారం గ్రామస్తులు సమావేశమై ఉత్సవ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జిట్టె వీరస్వామి, గౌరవ అధ్యక్షుడిగా శ్రీధర్, ఉపాధ్యక్షులుగా దండుగుల రాజు, కుమార్, రాజ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి వీరవజ్రయ్య, సహాయ కార్యదర్శులు సారయ్య, వెంకన్న, కోశాధికారి సత్తయ్య, కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

సాగునీటికి కృషి చేయాలి

బచ్చన్నపేట : జనగామ నియోజకవర్గానికి గోదావరి జలాలు రావడానికి ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి పాటు పడాలని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఇజ్జగిరి రాములు అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో వరి పంటలు ఎండిపోతుంటే మన ప్రాంత ఎమ్మెల్యే ఏమి పట్టనట్లు వ్యవహరిస్తున్నారని అన్నారు. గోదావరి జలాలను తీసుకురావడానికి డీసీసీ అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి అహర్నిశలు కృషి చేస్తున్నారని, మూడు రోజుల్లో గోదావరి జలాలు వస్తాయని అన్నారు.

చెస్ క్రీడలో ప్రతిభ

స్టేషన్‌ఘన్‌పూర్: ట్రస్మా ఆధ్వర్యంలో హనుమకొండ జిల్లా సోమిడిలోని రామన్‌హైస్కూల్‌లో నిర్వహించిన ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి కరస్పాండెంట్స్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్‌లో మండలంలోని శివునిపల్లి లయోల హైస్కూల్ డైరెక్టర్ మండల శంకర్ చెస్ క్రీడలో ప్రథమ బహుమతి గెలుచుకున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాస్థాయి కరస్పాండెంట్స్ గేమ్స్‌లో చెస్ పోటీలో జనగామ జిల్లా నుంచి ప్రథమస్థానంలో నిలిచిన మండల శంకర్‌ను ట్రస్మా జిల్లా బాధ్యులు, లయోల హైస్కూల్ యాజమాన్యం, ఉపాధ్యాయ బృందం ప్రత్యేకంగా అభినందించారు.

అభివృద్ధికి నోచుకోని నియోజకవర్గం

స్టేషన్‌ఘన్‌పూర్ : గత బీఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గం కేవలం పాలకుల హామీలకే పరిమితమవుతుందని, అభివృద్ధికి నోచుకోవడం లేదని టీడీపీ రాష్ట్ర నాయకులు బైరపాక ప్రభాకర్ అన్నారు. ఘన్‌పూర్ డివిజన్ కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు.ఎల్లయ్యగౌడ్, శ్రీనివాస్, ఐలయ్య, నాగరాజు పాల్గొన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం



జనగామ రూరల్ : స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం 2014–15 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా తమ చిన్న నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

జోరుగా 'మినరల్ వాటర్' దందా

- నీటిని శుద్ధి చేయకుండానే అమ్మకాలు
- నిబంధనలు విస్మరిస్తున్న ప్లాంట్ల యజమానులు
- చోద్యం చూస్తున్న అధికారులు



ప్యూరిఫయర్ వాటర్ సరఫరా చేస్తున్న ప్లాంట్ ఆటో



శివునిపల్లిలో మూతపడిన జీపీ వాటర్‌ప్లాంట్

స్టేషన్‌ఘన్‌పూర్: స్టేషన్‌ఘన్‌పూర్‌తో పాటు జిల్లాలోని వివిధ మండలాలలోని గ్రామాల్లో మినరల్ వాటర్ దందా మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతోంది. ప్రస్తుతం వేసవికాలం కావడంతో వాటర్‌ప్లాంట్ల యజమానులు కుమ్మక్కై అందిన కాడికి దండుకుంటున్నారు. వాటర్‌ప్లాంట్ల నిర్వాహకులు ఐఎస్ఐ ప్రమాణాలు పాటించకుండా మినరల్ వాటర్ అంటూ ప్యూరిఫైడ్ వాటర్‌ను అందిస్తూ ప్రజల్ని మోసం చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. సంబంధిత అధికారులు ప్రజాప్రతినిధులు ఈ విషయాన్ని పట్టించుకోకుండా చోద్యం చూస్తుండగా ఇదే అదనుగా ప్లాంట్ల యజమానులు ఆడిందే ఆటగా వ్యాపారం చేస్తున్నారు. జిల్లాలో దాదాపు 600కి పైగా వాటర్‌ప్లాంట్లు ఉన్నాయంటే మినరల్ వాటర్ దందా ఏ స్థాయిలో సాగుతుందో అర్థం చేసుకోవచ్చు. పలు వాటర్‌ప్లాంట్లలో నీటిని కనీసం శుద్ధి చేయకుండానే అమ్మకాలు చేస్తున్నారు. దీంతో ఆ నీటిని తాగిన వారు మోకాళ్లు, కీళ్ల నొప్పులతో బాధపడుతున్నారు. ప్రజల అవసరాలను ఆసరాగా చేసుకుని ప్యూరిఫైడ్ వాటర్‌నే మినరల్ వాటర్‌అంటూ 20 లీటర్లక్యాన్‌ను రూ.15 నుంచి రూ.20వరకు విక్రయిస్తున్నారు. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులకు ఏమాత్రం పట్టడం లేదు.

మూతపడ్డ శివునిపల్లి జీపీ వాటర్‌ప్లాంట్

శివునిపల్లిలో గతంలో గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వాటర్‌ప్లాంట్ దాదాపు 9 సంవత్సరాలుగా మూతపడగా పంచాయతీ అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. తప్పనిసరి పరిస్థితుల్లో ప్రజలు ప్రైవేట్ వాటర్‌ప్లాంట్ల వద్ద అధిక ధరలకు నీటిని కొనుగోలు చేస్తూ ఇబ్బందులకు గురవుతున్నారు.

తనిఖీల జాడే లేదు

కనీస నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా నిర్వహిస్తున్న వాటర్‌ప్లాంట్లపై సంబంధిత అధికారుల పర్యవేక్షణ ఏమాత్రం లేదు. వాటర్‌ప్లాంట్ల యజమానులు ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. కనీసం సంబంధిత అధికారులు ఇంతవరకూ తనిఖీలు చేసిన ఊసేలేదు. ప్లాంట్ల యజమానులు అధికారులకు మామూళ్లు ఇస్తున్నారని, అందుకే పట్టించుకోవడం లేదని పలువురు బహిరంగంగా విమర్శిస్తున్నారు. అధికారులు స్పందించి తనిఖీలు చేస్తూ వాటర్‌ప్లాంట్లపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ప్యూరిఫయర్‌నే మినరల్ వాటర్‌గా అమ్ముతున్నారు



ప్లాంట్లలో నీటిని తూతూమంత్రంగా ప్యూరిఫయర్ చేసి వాటినే మినరల్ వాటర్ అంటూ ప్రజలకు అమ్ముతున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో ఆ నీటిని తాగిన వారు ఆరోగ్యపరంగా ఇబ్బందులకు గురవుతున్నారు. వాటర్ ప్లాంట్లను అధికారులు తనిఖీలు చేసి చర్యలు తీసుకోవాలి.

\- శనబోయిన నగేశ్

జీపీలు వాటర్‌పాంట్లను నిర్వహించాలి



గ్రామాల్లో గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో వాటర్‌ప్లాంట్ల నిర్వహణ చేపట్టాలి. ఘన్‌పూర్‌కు జంట పట్టణంగా ఉన్న శివునిపల్లిలో గతంలో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో నడిపించిన వాటర్‌ప్లాంట్‌ను తిరిగి ప్రారంభించాలి. పంచాయతీ అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యంతో ప్రజలు నీటి కోసం ఇబ్బందులకు గురవుతున్నారు.

\- మేకల మల్లేశం

వర్గీకరణ చేపట్టే వరకు ఫలితాలు నిలిపివేయాలి

- ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగల్ల ఉపేందర్



లింగాలఘణపురం : నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

జనగామ రూరల్/లింగాలఘణపురం : ఎస్సీ వర్గీకరణ చేపట్టే వరకు ఉద్యోగ పరీక్ష ఫలితాలు నిలిపివేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగల్ల ఉపేందర్ డిమాండ్ చేశారు. పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద, లింగాలఘణపురం మండల కేంద్రంలో నిరసన తెలిపారు. కార్యక్రమంలో నాయకులు జగన్, స్టేషన్‌ఘన్‌పూర్ మాజీ జెడ్పీటీసీ మారకపాక రవి, యాదగిరి, ధర్మసాగర్ మాజీ ఎంపీపీ యాదగిరి, గండి యాదగిరి, కుమార్, రాంచందర్, కరుణాకర్, బాబు, నవీన్, సంజీవ, అనిల్, తదితరులు పాల్గొన్నారు.

చిల్పూరు : వర్గీకరణపై ప్రభుత్వం నిర్లక్ష్యం వీడాలని లేని పక్షంలో అది సాధించే వరకు నిరసన కార్యక్రమాలను చేపడతామని అంబేడ్కర్ యువజన సంఘాల రాష్ట్ర కోఆర్డినేటర్ ఇల్లందుల సుదర్శన్ అన్నారు. మండలంలోని వెంకటాద్రిపేటలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు అరూరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆదివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. వెంకటేశ్, దయాకర్, ప్రభాకర్, వెంకటస్వామి, రజనీకుమార్, కుమార్, నాగరాజు, యాదగిరి, మహిపాల్, తదితరులు పాల్గొన్నారు.

రఘునాథపల్లి: ఎస్సీ వర్గీకరణ ప్రకారమే రాష్ట్రంలో ఉద్యోగాల ఫలితాలను విడుదల చేయాలని ఎమ్మార్పీఎస్ జాతీయ పొలిట్ బ్యూరో నాయకులు బొడ్డు దయాకర్‌మాదిగ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఎండిన పంటలకు నీరందించాలి

- పెంబర్తిలో రైతుల నిరసన



జనగామ రూరల్ : ఎండిపోయిన పంట వద్ద నిరసన తెలుపుతున్న రైతులు

జనగామ రూరల్ : ఆరుగాలం కష్టపడి వరి పంట వేస్తే సకాలంలో నీరు అందక పంటలు ఎండుతున్నాయని రైతులు కన్నీరు పెట్టుకుంటున్నారు. తమ పంటలకు నీరు అందించి ఆదుకోవాలని ఆదివారం మండలంలోని పెంబర్తి గ్రామంలో రైతులు ఎండిన పంట వద్ద నిరసన తెలిపారు. గ్రామానికి చెందిన బండ్రు మల్లయ్య పెంబర్తిలో పెద్ద చెరువు పక్కన తన 5 ఎకరాలల్లో వరి పంట వేయగా 4 ఎకరాలు నీళ్లు లేక ఎండిపోయింది. వేల రూపాయల పెట్టుబడి పెట్టి పంట చేతికందే సమయంలో చేరువలో నీరులేక భూగర్భ జలాలు అడుగంటి పోయి ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే తమ గ్రామంలో గల కెనాల్ కాల్వను శుభ్రం చేయించి, పెద్ద చెరువు నింపి రైతుల పంటలను ఎండిపోకుండా కాపాడాలని రైతులు కోరుతున్నారు.

ఎండిన పంటల పరిశీలన

లింగాలఘణపురం : మండలంలోని పలు గ్రామాల్లో సాగునీరు అందక ఎండిపోయిన పంటలను ఆదివారం సీపీఎం మండల కార్యదర్శి కరుణాకర్ ఆధ్వర్యంలో సీపీఎం మండల కమిటీ బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు శేఖర్ మాట్లాడుతూ ఆరుగాలం కష్టపడి సాగు చేసిన వరి సాగునీరు అందక ఎండిపోయే పరిస్థితి ఎదురైందన్నారు. దేవాదుల కాలువలతో నీరు అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు దేవదానం, ఉప్పలయ్య, సుల్తానా, కృష్ణమూర్తి, బాబు తదితరులు ఉన్నారు.

పాలకుర్తిలో రాచరిక పాలన కొనసాగుతోంది



మాట్లాడుతున్న మంగళంపల్లి శ్రీనివాస్

పాలకుర్తి టౌన్: నియోజవర్గంలో ప్రజాపాలన జరగడం లేదని, రాచరిక పాలన కొనసాగుందని, ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, అనుమాండ్ల ఝాన్సీరెడ్డిపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత పెరిగిందని బీఆర్ఎస్ జెడ్పీఫ్లోర్ లీడర్లు మంగళంపల్లి శ్రీనివాస్, పుస్కూరి శ్రీనివాస్‌రావు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని శ్రీసోమేశ్వర ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ పరిపాలన చేతకాకనే ప్రతిక్ష పార్టీలపై కాంగ్రెస్ నాయకులు విమర్శలు చేస్తున్నారని అన్నారు. నియోజవర్గంలో ఏ సామాజిక వర్గం న్యాయం కోసం పోలీస్‌స్టేషన్‌కు వెళ్తే న్యాయం జరగడం లేదన్నారు. ఒకవైపు పంటలు ఎండుతుంటే స్థానికంగా ఉండి నీళ్లు వదిలేందుకు కృషి చేయాల్సిన ఎమ్మెల్యే అమెరికాలో గ్రీన్‌కార్డు పొందేందుకు వెళ్లారని అన్నారు. రైతుల తరపున మాజీ మంత్రి దయాకర్‌రావు పోరాటం చేస్తే భయపడి నీళ్లు వదిలారని గుర్తు చేశారు. దయాకర్‌రావు పోరాటం వల్లనే నీళ్లు వదిలితే ఆ ఘనత మాదేనని ఎమ్మెల్యే గొప్పలు చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పసునూరి నవీన్, తీగల దయాకర్, సిందె రామోజీ, నర్సింహనాయక్, రంగు కుమార్, ఈదురు ఐలయ్య, గాంధీనాయక్,బబ్బూరి శ్రీకాంత్‌గౌడ్, పేరం రాము, బిందు శ్రీనివాస్, బొబ్బల అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రజలు బీఆర్ఎస్ వెంటే ఉన్నారు : ఎర్రబెల్లి



పాలకుర్తి టౌన్: కాంగ్రెస్, బీజేపీలు చేసిన సర్వేలో ఎన్నికలు పెడితే బీఆర్ఎస్ అత్యధిక స్థానాలను గెలుచుకుంటుందని, ప్రజలు బీఆర్ఎస్ వెంటే ఉన్నారని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని శ్రీసోమేశ్వర ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన ముఖ్యకార్యకర్తల సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఏప్రిల్ 27న వరంగల్‌లో జరిగే బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ రజతోత్సవ సభకు నియోజవకర్గ వ్యాప్తంగా పార్టీ శ్రేణులను భారీగా తరలించాలని పిలుపునిచ్చారు. రాబోయే రోజుల్లో రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీలు పస్కూరి శ్రీనివాస్‌రావు, పల్లా సుందర్‌రాంరెడ్డి, మంగలంపెల్లి శ్రీనివాస్, మోహన్‌గాంధీనాయక్, బబ్బూరి శ్రీకాంత్‌గౌడ్, నర్సింహనాయక్, పసునూరి నవీన్, దయాకర్, సిందె రామోజీ, ఈదూరు ఐలయ్య, అశోక్‌రెడ్డి, కుమార్, మచార్ల ఎల్లయ్య, పూస మధు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బీరప్ప పండుగ



శివలింగాలను తేవడానికి డోలు చప్పళ్లతో వచ్చిన కులస్తులు

బచ్చన్నపేట : మండలంలోని తమ్మడపల్లి గ్రామంలో బీరప్ప దేవుని పెద్ద పండుగ ఆదివారం ఘనంగా ప్రారంభించారు. ఉదయాన్నే గ్రామ చివర ఉన్న బీరప్ప ఆలయంలో ఒగ్గు పూజారులు ప్రత్యేక పూజలు చేశారు. ప్రధాన ఒగ్గు పూజారులు మాట్లాడుతూ ఉదయం బియ్యం సుంకు అనంతరం, బీరప్ప ఆలయంలో ఉన్న 101 శివలింగాలకు పూజలు చేసి గొల్లకురుమ కులస్తులకు అప్పగించి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేయించామన్నారు. ఉదయం నూతన గొంగడిలో ఆ లింగాలను కట్టి, ఆనవాయితీగా ఊరి చివరన ఉన్న బావిలో ఆ లింగాలను దాచిపెట్టి, ఆ తర్వాత ఒగ్గు పూజారులు డోలు విన్యాసాలు, కత్తి సాములు చేసుకుంటూ ఆడుకుంటూ, పాడుకుంటూ బావి వద్దకు వెళ్లి తీసుకొచ్చారు. ఆ లింగాలను గుడిలో పెట్టి నేడు (సోమవారం) బీరప్ప దేవుడు, కామరాతికి వివాహం జరిపిస్తామని తెలిపారు. రాత్రి కులస్తులు మొత్తం బోనాలను చేయగా వాటిని ఆలయం వద్దకు తీసుకపోయి, బోనాలపై, ఇళ్లపై సరుగు వేశామని అన్నారు. పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. గొల్లకురుమ సంఘం కుల పెద్దలు పాల్గొన్నారు.

క్రమశిక్షణ విద్యనందించాలి

జనగామ రూరల్ : విద్యార్థులకు పాఠశాల స్థాయిలోనే క్రమశిక్షణ సంస్కారంతో విద్యనందించాలని డీసీపీ రాజమహేంద్రనాయక్ అన్నారు. ఆది వారం స్థానిక ఎస్పీఆర్ స్కూల్‌లో రమేష్ గురూజీ ఆధ్వర్యంలో సంస్కార వికాస సాధన యోగా శిబి రంలో భాగంగా తల్లిదండ్రుల ఆచార్యుల పాదపూజ కార్యక్రమం నిర్వహించారు.

క్రికెట్ అభిమానుల సంబురాలు



జనగామ రూరల్: దుబాయ్‌లో జరిగిన ఐసీసీ క్రికెట్ చాంపియన్ షిప్ ట్రోఫీని భారత్ కైవసం చేసుకోవడంతో ఆదివారం రాత్రి జనగామ చౌరస్తాలో క్రికెట్ అభిమానులు సంబురాలు చేసుకున్నారు. బాణ సంచాలు కాల్చి స్వీట్లు పంపిణీ చేసుకున్నారు. భారత్ మాతాకు జై అంటూ త్రివర్ణ పతాకంతో నినాదాలు చేశారు. అలాగే బచ్చన్నపేటలో పోచమ్మ దేవాలయం వద్ద క్రికెట్ అభిమానులు బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు.

దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాలు

పాలకుర్తి టౌన్: వేసవిలో ప్రజల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాలు దోహదపడతాయని ఎస్సై దూలం పవన్‌కుమార్ అన్నారు. ఆదివారం మహాత్మా హెల్పింగ్ హాండ్స్ వ్యవస్థాపకుడు, ఎంఐవీ గంట రవీందర్ ఆధ్వర్యంలో స్థానిక బస్టాండ్‌లో ప్రయాణికుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన చలివేంద్రంను ఎస్సై చాకలి ఐలమ్మ మనువరాలు చిట్యాల శ్వేతతో కలిసి ప్రారంభించారు.

తాగునీటి వసతి కల్పనకు చర్యలు

దేవరుప్పుల : ఊరూరా స్వచ్ఛమైన తాగునీటి వసతి కల్పించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు కాంగ్రెస్ మండల నాయకులు యాకస్వామి తెలిపారు. ఆదివారం మండలంలోని గొల్లపల్లిలో ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, పార్టీ ఇన్‌చార్జ్ ఝాన్సీరెడ్డి సౌజన్యంతో ఏర్పాటు చేస్తున్న వాటర్ ప్లాంట్ నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు.

సామాజిక సేవలో లయన్స్ ముందంజ

బచ్చన్నపేట : సామాజిక సేవలో లయన్స్ క్లబ్ ముందంజలో ఉంటుందని లయన్స్ జిల్లా 320 ఎఫ్ గవర్నర్ కుందూరు వెంకట్‌రెడ్డి అన్నారు. ఆదివారం క్లబ్ బచ్చన్నపేట ఆధ్వర్యంలో మండలానికి వైకుంఠ రథాన్ని అందించారు. ఆయన మాట్లాడుతూ పేదలకు సేవలను చేయడమే మా క్లబ్ లక్ష్యమన్నారు. అందుకు గానూ విద్యార్థులకు బ్యాగులు, బుక్స్ ప లు రకాల వస్తువులను అందిస్తున్నామని అన్నారు.

సంక్షిప్త సమాచారం

ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవాలి

రఘునాథపల్లి : ఎన్నికల సమయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవాలని లేనిపక్షంలో ప్రజాపోరాటాలు చేస్తామని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఆది సాయన్న హెచ్చరించారు. ఆదివారం మండలంలోని బానాజీపేటలో జరిగిన సీపీఐ మహాసభకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని జెండా ఆవిష్కరణ చేసి మాట్లాడారు. అనంతరం సీపీఐ కార్యదర్శిగా ముప్పిడి ఎల్లయ్య, సహాయ కార్యదర్శిగా ఊడ్గుల జయమ్మలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

శ్రద్ధగా చదివి భవిష్యత్‌కు బాటలు వేయాలి

కొడకండ్ల : శ్రద్ధగా చదువుకొని ఒత్తిడి లేకుండా పరీక్షలు బాగా రాసి మంచి ఫలితాలతో బంగారు భ విష్యత్‌కు బాటలు వేసుకోవాలని ఎంవీఐ, మహాత్మ హెల్పింగ్ హ్యాండ్స్ వ్యవస్థాపకుడు గంట రవిందర్ కోరారు. ఆదివారం స్థానిక కస్తూర్బా పాఠశాలలోని 40 మంది పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్, పెన్నులను ఆయన అందజేశారు.

మూఢనమ్మకాలను నిర్మూలించకుంటే అనర్థాలు

దేవరుప్పుల : శాస్త్రీయ, సాంకేతిక, వైద్య రంగాల పురోగతి పయనంలో మూఢనమ్మకాలను నిర్మూలించకుంటే అనేక అనర్థాలను ప్రజలు చవిచూడాల్సి వస్తుందని మూఢనమ్మకాల నిర్మూలన సంఘం (ఎంఎన్ఎస్) వ్యవస్థాపకుడు, జాతీయ అధ్యక్షుడు డాక్టర్ బైరి నరేశ్ అన్నారు. ఆదివారం మండలంలోని ధర్మాపురంలో ఎమ్మార్పీఎస్ హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జ్ యేసుపాదం ఆధ్వర్యంలో దొపాటి ప్రశాంత్, తూడి రేష్మల ఆదర్శ వివాహానికి ఆయన హాజరై స్వాభిమాన పెళ్లి ప్రమాణ పత్రాన్ని అందజేశారు.

అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూమిని కాపాడాలి

స్టేషన్‌ఘన్‌పూర్ : మండలంలోని ఇప్పగూడెంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల సమీపాన గతంలో కబ్జాకు గురైన ప్రభుత్వ భూమిని పరిరక్షించాలని గ్రామస్తులు, సీపీఎం నాయకులు రాజు, ఉప్పలయ్య కోరారు. గ్రామంలో ఇటీవల నూతనంగా సైడ్ డ్రైయినేజీలు, సీసీ రోడ్ల పనులు చేపడుతుండగా డ్రైయినేజీ నిర్మాణం కోసం కాల్వ తీస్తుండగా కాలనీవాసులతో కలిసి వారు ఆదివారం అడ్డుకున్నా రు.

ఉద్దేశపూర్వకంగా తప్పుడు ఆరోపణలు

తాము ఎలాంటి ప్రభుత్వ భూమి కబ్జా చేయలేదని, మా ఇల్లు, ఇంటి స్థలానికి సంబంధించిన పూర్తి పత్రాలు ఉన్నాయని, వ్యక్తిగత కక్ష్యలతో ఉద్దేశ్యపూర్వకంగా తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని తోటకూరి అనిల్ తెలిపారు. రాజకీయ కక్షలతో గ్రామంలో అభివృద్ధి పనులను అడ్డుకోవడం సరికాదన్నారు.

పద్మశాలీలు సంఘటితం కావాలి

బచ్చన్నపేట : పద్మశాలీలు సంఘటితమై వారి సమస్యల కోసం పాటుపడాలని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుర్రపు బాల్‌రాజు అన్నారు. ఆదివారం మండలంలోని పద్మశాలీలందరూ రాష్ట్ర 17వ అఖిల భారత పద్మశాలి మహాసభలకు హైదరాబాద్‌కు తరలివెళ్లారు.

ఘనంగా అగస్త్య మహర్షి విగ్రహావిష్కరణ

జఫర్‌గఢ్ : శివానంద సత్సంకల్ప ఫౌండేషన్ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో జఫర్‌గఢ్‌లోని వేల్పుగొండ లక్ష్మీనర్సింహ సీతారామచంద్రస్వామి ఆలయంలో నూతనంగా అగస్త్య మహర్షి విగ్రహావిష్కరణ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. వేడుకలకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఉదయాన్నే వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

విశ్వక్సేనా పూజతో బ్రహ్మోత్సవాలు ప్రారంభం

చిల్పూరు : బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి అర్చకులు రవీందర్‌శర్మ, రంగా చార్యులు, కృష్ణమాచార్యుల వేదమంత్రాల మధ్య బ్రహ్మోత్సవం ప్రారంభించారు. చైర్మన్ శ్రీధర్‌రావు-కిరణ్మయి, పాల్గొన్నారు.

గోదావరి జలాలను అందించాలి

- సర్పంచ్‌ల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు సతీష్‌రెడ్డి



ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ నాయకులతో రైతులు

బచ్చన్నపేట : రాష్ట్రంలోనే అత్యంత కరువు ప్రాంతమైన బచ్చన్నపేటకు గోదావరి జలాలను అందించాలని సర్పంచ్‌ల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు గంగం సతీష్‌రెడ్డి అన్నారు. ఆదివారం అన్నదాతలో కలిసి స్థానిక ప్రధాన చౌరస్తాలో సాగు నీటి కోసం ధర్నా , రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోనే బచ్చన్నపేట అత్యంత కరువైన ప్రాంతమని అన్నారు. ఈ ప్రాంతంలో వర్షాలు తక్కువగా కురిసి నీటి మట్టం కూడా చాలా లోతులో ఉంటుందని గతంలో సర్వేలను నిర్వహించిన నిపుణులు తెలిపారని అన్నారు. ప్రతి సంవత్సరం రబీ పంటలకు గోదావరి జలాలు వచ్చేవని ఈ సంవత్సరం రాకపోవడంతో నాటు వేసిన 30 శాతం వరి పంటలు ఎండిపోయాయని అన్నారు. గోదావరి జలాలను అందించని పక్షంలో ఆందోళన కార్యక్రమాలను చేపడతామని హెచ్చరించారు. పోలీసులు జోక్యం చేసుకొని ధర్నాను విరమింపజేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ పూర్ణచందర్, నాయకులు ప్రతాప్‌రెడ్డి, ఫిరోజ్, మద్దికుంట రాధ, శివరాత్రి రాజనర్సు, వెంకట్‌రెడ్డి, రాజు, సిద్దిరాంరెడ్డి, అయిలుమల్లయ్య, గోవర్ధన్‌రెడ్డి, మధుప్రసాద్, దస్తగిరి, భాస్కర్‌రెడ్డి, సిద్దారెడ్డి పలువురు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

వారం రోజుల్లో కుమార్తె వివాహం

- రోడ్డు ప్రమాదంలో కుమారుడి మృతి
- 6న రోడ్డు ప్రమాదం
- యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బ్రెయిన్ డెడ్
- శ్రీమన్నారాయణపురంలో విషాదఛాయలు



శ్రీనాథ్(ఫైల్)

రఘునాథపల్లి: ఈ నెల 16న కూతురి పెళ్లి.. ఇంతలోనే ఆ కుటుంబంలో తీరని విషాదం నెలకొంది. స్నేహితుడి బరాత్‌కు వెళ్లిన యువకుడు రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని శ్రీమన్నారాయణపురం గ్రామానికి చెందిన చిన్నం రవి-సునిత దంపతులకు కూతురు, కుమారుడు ఉన్నారు. కూతురు శిరీషకు వివాహం కుదిరింది. ఈ నెల 16 పెళ్లి జరుగనుంది. కుమారుడు శ్రీనాథ్ (19) డిగ్రీ ఫస్టియర్ చదువుతున్నాడు. ఈ నెల 6న గ్రామంలో స్నేహితుడి బరాత్ నిర్వహించేందుకు నిడిగొండ వద్ద డీజే ఆపరేటర్‌ను తీసుకొచ్చేందుకు స్నేహితులతో కలిసి ద్విచక్రవాహనంపై వెళ్తున్నాడు. ఎదురుగా వస్తున్న బైక్ ఢీ కొట్టడంతో శ్రీనాథ్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు జనగామ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం సికింద్రాబాద్‌లోని యశోద ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శ్రీనాథ్ బ్రెయిన్ డెడ్ అయినట్లు వైద్యులు ధృవీకరించారు.

అవయవదానం..

శ్రీనాథ్ బ్రెయిన్ డెడ్ కావడంతో అవయవదానంపై అక్కడి డాక్టర్లు వివరించారు. తల్లిదండ్రులు అంగీకరించడంతో ఆదివారం అవయవాలు సేకరించారు. శ్రీనాథ్ తాను మరణించి మరి కొందరి జీవితాల్లో వెలుగులు నింపగా.. తల్లిదండ్రుల నిర్ణయాన్ని అందరూ అభినందిస్తున్నారు. మృతదేహానికి యశోద ఆస్పత్రి సిబ్బంది గౌరవ వందనం సమర్పించి అంబులెన్స్‌లో స్వగ్రామానికి తరలించారు. శ్రీమన్నారాయణపురంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

చికిత్స పొందుతున్న యువకుడి మృతి



వాసుదేవ్ (ఫైల్)

బచ్చన్నపేట : పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలోని బసిరెడ్డిపల్లిలో ఆదివారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసుల వివరాల ప్రకారం. చెప్యాల శ్యామల-చంద్రమౌళి దంపతులకు ఇద్దరు సంతానం. పెద్ద కుమారుడు వాసుదేవ్ (24) డిగ్రీ వరకు చదువుకున్నాడు. డిగ్రీ పూర్తి చేసి రెండేళ్లు అవుతున్నా చదివిన చదువుకు ఉద్యోగం రాకపోవడంతో వాసుదేవ్ మనస్తాపంతో శనివారం రాత్రి తన వ్యవసాయ బావి వద్ద పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు 108లో జనగామ ఏరియా ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. అక్కడి వైద్యులు మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్ తీసుకెళ్లమని సూచించగా వారు నిమ్స్‌కు తీసుకెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

సీఎం సభను విజయవంతం చేయాలి



రఘునాథపల్లి : మాట్లాడుతున్న జగదీష్‌చందర్‌రెడ్డి

చిల్పూరు/జఫర్‌గఢ్/రఘునాథపల్లి: స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ కేంద్రంలో రూ. 800ల కోట్లతో చేపట్టే అభివృద్ధి పనులకు ఈనెల 16న సీఎం రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేస్తార ని, అనంతరం నిర్వహించే భారీ బహిరంగసభకు పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని చిల్పూరు ఆలయ చైర్మన్, పార్టీ సమన్వయకర్త పొట్లపల్లి శ్రీధర్‌రావు, జిల్లా గ్రంథాలయ చైర్మన్ మా రు జోడు రాంబాబు, జఫర్‌గఢ్ మండల పార్టీ అధ్యక్షుడు నూకల అయిల య్య, రఘు నా థపల్లి పిలుపునిచ్చారు. ఆయా మండలాల్లోని గ్రామాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆది వారం ప్రత్యేక సమావేశాలు నిర్వహించారు. భారీ బహిరంగ సభకు ప్రజలను పెద్ద సంఖ్యలో తరలించాలని పిలుపునిచ్చారు.